# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :44 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 05-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా కృషి

హైదరాబాద్, తెలంగాణలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎలక్షన్ కమిషనర్ పలు కీలక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పెట్రోలియం సంస్థలు, రైల్వేతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బీఆర్కే భవన్‌లో ఓటర్ అవేర్‌నెస్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. రైల్వే పెట్రోలియం సంస్థల్లో ఓటర్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైల్వే, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మరోవైపు.. ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిఘా విస్తృతం చేస్తామన్నారు సీఈఓ వికాస్ రాజ్. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం తరలింపు, నిల్వలపై నిఘా పెంచాలని ఆర్డర్స్ పాస్ చేశారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఎస్పీలతో ఆయన గతంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైల్వేతో పాటు పెట్రోలియం సంస్థల్లో ఓటరు అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు ఈసీ అధికారులు తెలిపారు.

## రేవంత్ గెలుపు సెంటిమెంట్ పాటిస్తున్న హైకమాండ్



హైదరాబాద్, లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ మీద నుంచే కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించనుంది. 6న జనజాతర సభ ద్వారా జాతీయ మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. సభను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ ఈ సభకు హాజరుకానున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇదే స్థలంలో తొలి బహిరంగ సభను నిర్వహించింది. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరిట భారీ బహిరంగ సభను కూడా నిర్వహించింది. విజయభేరి వేదిక మీద నుంచే సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఆయా గ్యారంటీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో కాంగ్రెస్ శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. తమకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. తెలంగాణ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల హామీ ప్రజల్లోకి దూసుకెళ్లినట్టుగానే లోక్‌సభ ఎన్నికలకు ఇచ్చే ఐదు గ్యారంటీలు దేశంలోని అన్ని మూలలకు, అన్ని వర్గాల్లోకి వెళుతాయని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం బలంగా నమ్ముతున్నది. తుక్కుగూడ వేదికగా నిర్వహించిన విజయభేరి సభలో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని కుండబద్దలు కొట్టి చెప్పారు. తాజాగా కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ, ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో లక్షలాది ప్రజల సమక్షంలో తమ ప్రభుత్వం కొలువుదీరుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఈ సెంటిమెంట్ హైకమాండ్ నేతల్ని కూడా ఆకర్షిస్తోంది.

## ఈ సారైన ఓటింగ్ శాతం పెరగాలి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో ఎప్పుడు 40 శాతానికి మించి ఓటింగ్ శాతం నమోదు కావడం లేదని కిషన్ రెడ్డి అన్నారు. మనం దృష్టి సారించాలి ఓటింగ్ పర్సంటేజ్ పెంచాలన్నారు. అంబర్ పేట్ నియోజకవర్గం కాచిగూడ డివిజన్ పర్యటనలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పోలింగ్? లో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈసారి దేశం, భవిష్యత్తు కోసం ఓటు వేయాలని కోరారు. దేశాభివృద్ధి కోసం ఓటు వేయాలని దీంతో మన భవిష్యత్ కూడా బాగుపడుతుందన్నారు. 2014కు ముందు 50 ఏళ్లు దేశాన్ని కాంగ్రెస్ పరిపాలించిందని అంటూ ఆ తర్వాత మోడీ దేశంలో ఎలాంటి మార్పులు తీసుకోచ్చారో చూడండి అని ఆయన పేర్కొన్నారు. అవినీతి రహిత పరిపాలన అందించిన మోడీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ భద్రతను, దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తం చేశారన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీత వేసారు అంటూ వెల్లడించారు. ప్రతి ఒక్కరు ఓటు వేసేటప్పుడు ఒక్కసారి ఆలోచించండి అని కిషన్ రెడ్డి తెలిపారు. గతంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఐఎస్ఐ ఉగ్రవాద సంస్థలు మన హైదరాబాద్ నగరంలో ఏ విధంగా బలపడ్డాయో అందరికి తెలుసన్నారు. .. లుంబినీ పార్కు, గోకుల్? ఛాట్?, దిల్? షుక్? నగర్ లాంటి ప్రదేశాల్లో మన బిడ్డల్ని పొట్టన పెట్టుకున్నారని, .. కర్ఫ్యూలు, మతకల్లాలు, బాంబుపేలుళ్లు ఉండేవన్నారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి బాంబుదాడులు లేవని పేర్కొన్నారు. అలాగే, ప్రధాని నరేంద్ర



మోడీ ఆధ్వర్యంలో ఐదో ఆర్థిక అతి పెద్ద దేశంగా తీర్చిదిద్దారని ఆయన తెలిపారు. యూకే లాంటి దేశాలను కూడా వెనక్కి నెట్టేసి ఐదో స్థానంలోకి రావడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతోనే ఆర్థికంగా బలపడ్డామన్నారు. డిజిటల్? ట్రాన్జేక్షన్? చాలావరకూ పెరిగిందన్నారు. ఈ దేశంలో నిరక్షరాస్యత ఉందని కాంగ్రెస్? నాయకులు మాట్లాడారని అన్నారు. కానీ ఈ రోజు ప్రతీ చిన్న దుకాణంలో సాంకేతిక లావాదేవీలు పెరిగాయన్నారు. సాంకేతికతో ఆర్థిక లావాదేవీల్లో అమెరికాను కూడా మించిపోయామన్నారు. ఇక, రామ జన్మ భూమి, ఆర్టికల్? 370, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇలాంటి అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. సైనిక, ఆర్మీలో మహిళలకు అవకాశం కల్పించామని కిషన్ రెడ్డి తెలిపారు.

## బిజేపీ మేనిఫెస్టో లీక్.. కొత్త పథకాలు ఇవే..

న్యూఢిల్లీ,సార్వత్రిక ఎన్నికలు-2024కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఏప్రిల్ 19న తొలి దశ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికల సంఘం ఏర్పాట్లలో బిజీగా ఉంది. మరోవైపు గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. తొలిదశ ఓటింగ్‌కు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నప్పటికీ.. బీజేపీ ఇంకా తన మేనిఫెస్టో విడుదల చేయలేదు. వచ్చే వారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 19న తొలి దశ ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో 10వ తేదీలోపు బీజేపీ మేనిఫెస్టో విడుదలయ్యే అవకాశం ఉంది. మోదీ హామీ, అభివృద్ధి చెందిన భారత్ 2047 పేరుతో రిలీజ్ చేసే అవకాశాలున్నాయి.

మేనిఫెస్టోలో..

బీజేపీ మేనిఫెస్టోలో రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశంలో పేదలు, యువత, రైతులు, మహిళలు అనే నాలుగు అతిపెద్ద కులాలు మాత్రమే ఉన్నాయని ప్రధాని మోదీ గతంలో చాలాసార్లు చెప్పిన నేపథ్యంలో.. తన మేనిఫెస్టోలో కాషాయ పార్టీ ఈ నాలుగు వర్గాలకు కొత్త హామీలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

27మందితో కమిటీ



మేనిఫెస్టో కోసం బీజేపీ 27 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యవహరిస్తున్నారు. ఈ మేనిఫెస్టోలో గత 10 ఏళ్లలో ప్రభుత్వం చేసిన పనులు, నెరవేర్చిన హామీలతో పాటు రాబోయే ఐదేళ్లు ఏం చేయబోతామనే విషయాలు పొందుపర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఇంకా కొలిక్కిరాని ఎంపీ అభ్యర్థుల ఎంపిక



హైదరాబాద్,పార్లమెంట్ అభ్యర్థుల ప్రకటనలో అధికార కాంగ్రెస్ పార్టీ వెనుకబడింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా కాంగ్రెస్ మాత్రం మూడు స్థానాలను పెండింగ్‌లో ఉంచింది. 14 ఎంపీ స్థానాలను గెలుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అభ్యర్థుల ఎంపికలో మాత్రం ఆ జోష్ ప్రదర్శించడం లేదన్న విమర్శ ఉంది. అభ్యర్థుల ఎంపికలో జాప్యానికి సమర్థులైన నాయకులు దొరక్కపోవడమే కారణమన్న చర్చ పార్టీలో జరుగుతున్నది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు గాను కాంగ్రెస్ ఇప్పటి 14మంది అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), దానం నాగేందర్ (సికింద్రాబాద్), సునీతా మహేందర్‌రెడ్డి (మల్కాజిగిరి), నీలంమధు (మెదక్), కడియం కావ్య (వరంగల్) ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. మిగిలిన కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో మల్లగుల్లాలు పడుతున్నది. పారాచ్యూట్ నేతలకు టికెట్లు ఇవ్వడంపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ గెలుపు కోసం తప్పడం లేదంటూ ఇటు రాష్ట్ర నేతలు, అటు అధిష్ఠానం అసమ్మతి నేతలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నది. 6న తుక్కుగూడలో కాంగ్రెస్ సభ ఉండడంతో ఆలోగా మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారా? లేదా? అన్నది కూడా ప్రశ్నార్థకంగానే మిగిలింది. పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించకుండా పార్టీ అగ్రనేతలతో ఎన్నికల ప్రచారానికి దిగడం బాగుండదని పార్టీలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.


సామాజిక వర్గాల సమతుల్యత ఏదీ?

కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో సామాజిక వర్గాల సమతుల్యత లోపించిందన్న విమర్శ ఉంది. ఇప్పటి వరకు 14 మంది అభ్యర్థులను ప్రకటిస్తే అందులో ఆరుగురు అభ్యర్థులు ఒకే సామాజిక వర్గానికి చెందిన (రెడ్డి) వారు ఉన్నారు. ఖమ్మం సీటును కూడా రఘురాంరెడ్డికి ఇస్తారన్న ప్రచారం జరుగుతున్నది. అదే నిజమైతే రెడ్డి సామాజికవర్గానికి ఏడు సీట్లు ఇచ్చినట్టు అవుతుంది. మూడు ఎస్సీ రిజర్వు స్థానాలనూ మాల సామాజికవర్గానికి ఇవ్వడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నేతలతోపాటు మాదిగ సామాజిక వర్గాలు, సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు, బీసీలకు మూడుసీట్లు మాత్రమే ఇవ్వడంపై ఆ వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీసీలకు ప్రాధాన్యం దక్కలేదని, ఇప్పుడు పార్లమెంటులోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నదని బీసీలు మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడుస్థానాల్లో కనీసం కరీంనగర్ టికెట్ అయినా బీసీకి ఇవ్వాలని కోరుతున్నారు. అధిష్ఠానం మాత్రం ఆ స్థానం నుంచి వెలమ సామాజికవర్గానికి చెందిన వెలిచాల రాజేందర్ రావును బరిలోకి దింపాలని యోచిస్తున్నట్టు తెలిసింది. బీసీల నుంచి వ్యతిరేకత రాకుండా హైదరాబాద్ స్థానాన్ని మొక్కుబడిగా కేటాయించే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. బీసీలు, మాదిగ సామాజికవర్గం పార్టీకి దూరమైతే ఆ ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపించే అవకాశం ఉందని పార్టీలోని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రకటించిన స్థానాలివే

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో రెడ్డి సామాజికవర్గానికి 6, ఎస్సీ-3 (మాల), ఎస్టీ-2(లంబాడి, ఆదివాసీ), బీసీ-3 (లింగాయత్, ముదిరాజ్, మున్నూరుకాపు) సామాజిక వర్గాలు ఉండగా,ఇంకా 3 స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి.

## నల్లగొండ నవాబ్ ఎవరు?




నల్గొండ : నల్లగొండ పార్లమెంటుపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఆయా ప్రధాన పార్టీలు ముమ్మర కసరత్తు అనంతరం అభ్యర్థులను ప్రకటించాయి. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ గట్టి పట్టుదలతో ఉంది. ఎలాగైనా సత్తా చాటాలని కమలం, గులాబీ పార్టీలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీల అంతర్గత సమావేశాలతో అభ్యర్థులు తమ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. నల్గొండలో పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. గెలుపు కోసం అధికార, విపక్షాలు వ్యూహరచనల్లో మునిగి తేలుతున్నాయి. 1952లో నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ ఏర్పాటు తర్వాత మొదట్లో కమ్యూనిస్టులు గెలవగా ఆ తరువాత ఓసారి టిడిపి, అనంతరం కాంగ్రెస్ అభ్యర్థుల హవా కొనసాగింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ రెడ్డి 25 వేల 682 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్‌లకు గాను బిఆర్ఎస్ నుండి ఆరుగురు ఎంఎల్ఏలు గెలవగా, కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ ఒక్కరే గెలిచారు. అయినప్పటికీ ఎంఎల్ఏగా గెలిచిన ఉత్తమ్ నల్గొండ ఎంపిగా పోటీ చేసి విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెంగ్మెంట్‌లకుగాను ఆరు సెగ్మెంట్‌లలో ఎంఎల్ఏ గెలవగా, ఒక్క సెంగ్మెంట్‌లో మాత్రమే బిఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో మాదిరిగానే ఎంపి ఎన్నికల్లో అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత కలసి వస్తుందని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తమ సిట్టింగ్ పార్లమెంటు స్థానాన్ని నిలబెట్టుకునేందుకు హస్తం పార్టీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్ రెడ్డి నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తండ్రి జానారెడ్డి, రఘువీర్ రెడ్డి సోదరుడైన నాగార్జునసాగర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్ రెడ్డి సైతం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పార్లమెంటు పరిధిలోని సీనియర్లయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మిగతా ఎంఎల్ఏలంతా కలసి తన కుమారుడు రఘువీర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని జానారెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయా నియోజకవర్గాల పరిధిలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 5 లక్షల మెజార్టీ లక్షంగా పని చేయాలని సీనియర్ నాయకుడు జానారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలా వుంటే మరో జాతీయ పార్టీ బిజెపి సైతం సంప్రదాయానికి భిన్నంగా హుజూర్‌నగర్ బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ శానంపూడి సైదిరెడ్డికి పార్టీ కండువా కప్పి నల్గొండ ఎంపి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ అనూహ్య ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశా రు. సైదిరెడ్డి అభ్యర్థిత్వంపై ఆ శ్రేణుల్లో అసంతృప్తి జ్వా లలు సైతం ఎగిసిపడ్డాయి. సైదిరెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో కాంగ్రెస్ సీనియర్ నేత, పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ ఎంపిగా ఎన్నియ్యారు. దీంతో ఆయన తన హుజూర్‌నగర్ ఎంఎల్ఏ సీటుకు రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికలో అదే పార్టీ నుంచి ఉత్తమ్ సతీమణి పద్మావతి రెడ్డిని బరిలో నిలిపారు. అయితే గులాబీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి దాదాపు 44 వేల మెజార్టీతో పద్మావతి రెడ్డిపై గెలుపొంది రికార్డు సృష్టించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా ఓటమి చెందిన శానంపూడి సైదిరెడ్డిని బిజెపిలోకి ఆహ్వానించిన మరుచటిరోజే ఆయనకు నల్గొండ ఎంపి టికెట్ ప్రకటించారు. అయితే పార్టీ పెద్దల జోక్యంతో సైదిరెడ్డి పార్టీలోని అందరు నేతలను కలుపుకొని వెళ్ళడమే కాకుండా నల్గొండ మేనిఫెస్టోను రూపొందించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన గులాబీ పార్టీకి కీలకమైన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముఖ్యమైన నాయకులందరూ ముఖం చాటేస్తున్నారు. కాగా, మాజీ ఎంఎల్ఏ కంచర్ల భూపాల్ రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల బరిలో దిగేందుకు ముందుకు వచ్చారు. అంతకుముందు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జరిగినా సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆయన వెనక్కి తగ్గారు. తరువాత మాజీ ఎంఎల్‌సి తేరా చిన్నపరెడ్డి పేరు వినిపించినా లిక్కర్ కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అరెస్టు సహా ఇతర రాజకీయ పరిణామాలతో ఆయన ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ప్రస్తుతం తేరా చిన్నపరెడ్డి బిజెపి వైపు చూస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే కంచర్ల కృష్ణారెడ్డిని నల్గొండ ఎంపి అభ్యర్థిగా గులాబీ అధినేత కెసిఆర్ ప్రకటించారు. 2022లో మునుగోడు ఉప ఎన్నికలో, ఆ తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ కోసం కంచర్ల కృష్ణా రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అప్పటి రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు టికెట్ దక్కలేదు. మొత్తానికి నల్గొండ పార్లమెంటు అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని ప్ర కటించడంతో ఇకపై ముఖ్య కార్యకర్తల సమావేశాలు సహా నియోజకవర్గాల వారీగా సభలు, సమావేశాలతో ముందుకెళ్ళాలని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. రాష్ట్రంలో కీలకమైన ఈ స్థానాన్ని ఎవరు కైవసం చేసుకుంటారో వేచిచూడాల్సిందే.

## తేల్చిచెప్పేశారు.. ఎన్నికల్లో పోటీ చేయను..

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల వేళ మండ్య స్వతంత్ర ఎంపీ సుమలత నిర్ణయంపై రాజకీయ ఉత్కంఠతకు తెరపడింది. మండ్యలో గురువారం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని, త్వరలోనే బీజేపీలో చేరుతానని ప్రకటించారు. మండ్య నియోజకవర్గంతో సంబంధాలను దూరం చేసుకోలేనని, ఇది తమ కుటుంబానికి సెంటిమెంట్ అన్నారు. ఇక్కడి నుంచే అంబరీశ్ రాజకీయాల్లో రాణించారని గుర్తు చేసుకున్నారు. స్వతంత్రంగా పోటీ చేసే ఆలోచన లేదన్నారు. ఐదేళ్లపాటు ఎంపీగా శాయశక్తులా పనిచేశానని, రాజకీయాల్లో కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. స్వతంత్ర ఎంపీగా ఉన్నా రూ. 4వేల కోట్ల గ్రాంటు తెచ్చానని పేర్కొన్నారు. బీజేపీ ప్రతి విషయంలోనూ తనను విశ్వాసంలోకి తీసుకుందని, మీ నాయకత్వం కావాలని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారని అన్నారు. నాయకత్వాన్ని పెంపొందించే గుణం బీజేపీలో ఉందన్నారు. బీజేపీలో చేరడంలో తన స్వార్థం లేదని, లాభం కోసం ప్రయత్నించి ఉంటే మరో నియోజకవర్గాన్ని ఎంచుకుందునని, అలాంటి నిర్ణయం తీసుకుని ఉంటే మండ్యను వదులుకోవాల్సి ఉండేదన్నారు. రాజకీయాలు చేస్తే మండ్యలో మాత్రమే అనే నిర్ణయంతోనే కొనసాగానని అన్నారు. అంబరీశ్ అభిమానులను వదిలి వెళితే మండ్య కోడలు అనిపించుకోవడం సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ లో చేరాలని కొందరు సూచించారని, మరికొందరు సుమలత అవసరం కాంగ్రెస్ కు లేదని చెప్పారన్నారు. అంబరీశ్ ఉన్నప్పుడు కూడా ఇదే తరహాలో వ్యవహరించారని, తనకు గౌరవం లేని కాంగ్రెస్ లోకి వెళ్లాలా... అంటూ ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే బీజేపీ పరోక్షంగా మద్దతు ఇచ్చి అభ్యర్థిని నిలపలేదన్నారు. ప్రస్తుతం బీజేపీ-జేడీఎసతో పొత్తులో భాగంగా మండ్యను వదులుకున్నానని అన్నారు. చివరిక్షణం దాకా మండ్య కోసం ప్రయత్నించానని, సాధ్యం కాలేదన్నారు. బెంగళూరు ఉత్తర, చిక్కబళ్లాపుర, మైసూరు టిక్కెట్ ఇస్తామని



సూచించారని, మండ్యను విడిచి ఎక్కడికి వెళ్లదలచుకోలేదని, ఓడినా గెలిచినా చివరకు ప్రాణం పోయినా మండ్యలోనే అంటూ తేల్చి చెప్పారు. సుమలత పోటీ చేసేది లేదని, ప్రత్యేకించి బీజేపీలో చేరతానని ప్రకటించడంతో మండ్య జేడీఎస-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి హెచ్‌డీ కుమారస్వామికి కొండంత బలం దక్కినట్టయింది. మూడు రోజుల క్రితమే కుమారస్వామి పాత రాజకీయ విభేదాలను వదిలి నేరుగా సుమలత ఇంటికెళ్లి చర్చలు జరిపిన సంగతి విదితమే.

### ఏపిలో ఎన్నికల తనిఖీలు ముమ్మరం

అమరావతి,రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ. 34 కోట్లు విలువ చేసే నగదు, ఆభరణాలు ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పరిస్థితుల్ని ఆయన మీడియాకు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత తనిఖీల్లో రూ. 11 కోట్ల నగదు, రూ. 7కోట్లు విలువైన మద్యం, రూ. 10 కోట్లు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను సీజ్ చేశాం.

## సంపాదకీయం

శుక్రవారం 05-04-2024

# అవినీతిపై చర్యలకు ఉపక్రమించాలి

విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టుల కుంభకోణాలు,అ వినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని సిఎం రేవంత్ కూడా పత్రికా ముఖంగా ప్రకటిస్తున్నారు. అయినా సిగ్గూఎగ్గూ లేకుండా ఎదురుదాడే మంత్రం అన్నట్లుగా బిఆర్ఎస్ నేతల వ్యవహారం ఉంది. నిజానికి ఇంతటి విధ్వంసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరగలేదు. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు. తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్న వేళ సిఎం పదవి కత్తిమీద సాము లాంటిదే. ఈ క్రమంలో అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజా మద్దతు రేవంత్‌కు దక్కుతుంది. ఇప్పటికీ విపక్ష బిఆర్ఎస్ చేస్తున్న గోలను ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ..కెసిఆర్ అవినీతి పాలనను ఎండగడుతూనే ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి చేయాలి. అలాగే రేవంత్ కూడా త్రివిక్రముడిగా ముందుకు సాగాలి. ఇటు అంతర్గత శతృవులను, అటు బాహ్య శతృవులను ఎదుర్కోవాలి. ప్రధానంగా బిఆర్ఎస్, బిజెపిలను కూడా ఎదుర్కొనేలా శక్తి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్ఇనకలు ఇందుకు అతిపెద్ద పరీక్ష పెట్టబోతున్నాయి. ఎందుకంటే బిఆర్ఎస్, బిజెపి లోపాయకారి ఒప్పందం చేసుకున్నాయని స్వయంగా సిఎం ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణం గా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చు కోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. అటు బిజెపిని, ఇటు బిఆర్ఎస్‌ను ఢీకొనే ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ప్రధానంగా కెసిఆర్‌ను ధైర్యంగా విమర్శిస్తూ.. అవినీతి కేసులను బట్టబయలు చేస్తూ ముందుకు సాగడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు ఈ విషయం గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం రానీయరు. అయినా కెసిఆర్‌ను, బిఆర్ఎస్‌ను ఢీకొని గట్టిగా ఎదురొడ్డి నిలిచేలా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో సత్తా చాటితే రేవంత్ మరింత బలోపేతం అవుతారు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప ముమ్మందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. సహజంగానే బీఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా ఉంటంది. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెన్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. కేసీఆర్‌కు హైకమాండ్ అంటూ ఎవరూ లేరు. ఆయనే హైకమాండ్. అందుకే తన మాటే శాసనం అన్న రీతిలో సాగారు. అనేక అవకతవకలను వెలికితీస్తున్న క్రమంలో ఇక్కడే సిఎంగా రేవంత్ కొంత కఠినంగానే ఉండాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే వేగంగా దూసుకు పోవాలి. ప్రజల్లో పాలనపట్ల నమ్మకం కలిగించాలి. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. ఈ క్రమంలో బిఆర్ఎస్ అవినీతిని ఎండగడుతూనే ప్రజల సంక్షేమం కోరి ముందుకు సాగాలి. పనుల్లో వేగం పెంచాలి. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేయాలి. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఎన్నికలయ్యాక వేగంగా ప్రజల్లో సమస్యలపై పరిష్కారానికి చర్యలకు పూనుకోవాలి. వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. కెసిఆర్ అండ్ కో చేస్తున్న ఆరోపణలను గట్టిగా తిప్పి కొడుతూనే..వారి అవినీతిపై వేగంగా చర్యలకు ఉపక్రమించాలి. కేవలం ఆరోపణలతో కాలక్షేపం చేస్తే ప్రజలు కూడా నమ్మరు. చేసిన ఆరోపణలను నిరూపించగలగాలి. అప్పుడే ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడుతుంది.

# నాడు సానుకూలం.. నేడు ప్రతికూలం..



అమరావతి,సరిగ్గా ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీకి అన్నీ మంచి శకునములే కనిపిస్తున్నాయి. విజయం వరించే దీవెనలే లభిస్తున్నాయి. 2019 ఎన్నికల వేళ పరిస్థితికి ఇది పూర్తి భిన్నంగా ఉంది. నాటి ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చి ఒంటరిగా బరిలోకి దిగింది. ప్రధాని మోడీ సర్కార్ ఏపీ అభివృద్ధి విషయంలో ఇసుమంతైనా సహకారం అందించడం లేదని ఆరోపిస్తూ ఎన్డీయే నుంచి బయటకు వచ్చింది. అదే సమయంలో తెలుగుదేశం రాష్ట్ర విభజన హామీలు సాధించడంలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా విఫలమైందంటూ అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ఊరూ వాడా ఏకం చేసేలా ప్రచారం సాగించారు. కేంద్రంలోని మోడీ సర్కార్ తో చంద్రబాబు విభేదించిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అధీనంలో ఉన్న అప్పటి అధికార యంత్రాంగం అంతా చంద్రబాబు ఆపద్ధర్మ ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేసింది. వైసీపీ ఫిర్యాదులపై ఆఘమేఘాల మీద స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం అప్పటి సీఎస్ ను విధుల నుంచి తప్పించి ఎల్వీ సుబ్రహ్మణ్యంను నేరుగా నియమించింది. ఆయన అప్పట్లో వైసీపీకి ఎంత అనుకూలంగా వ్యవహరించారో అందరికీ తెలిసినదే. ఆయన సమన్ చేసి పిలిపించుకోవలసిన డీజీపీ వద్దకు స్వయంగా వెళ్లి మరీ దిశా నిర్దేశం చేశారంటే.. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఏ స్థాయిలో కుట్ర జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో మీడియా మొత్తం చంద్రబాబుకు అన్నీ అపశకునాలే ఎదురౌతున్నాయంటూ కథనాలు ప్రచురించింది. ప్రసారం చేసింది. ఏది ఏమైనా అప్పటి ఎన్నికలలో చంద్రబాబు ఎదుర్కొన్న పరిస్థితులన్నీ పద్మవ్యూహంలో ఇరుక్కున్న అభిమన్యుడిని తలపించాయి. దాంతో అప్పుడు తెలుగుదేశం పరాజయం పాలై విపక్షానికి పరిమితం కావలసి వచ్చింది. ఐదేళ్లు గిర్రున తిరిగే సరికి తెలుగుదేశం అనూహ్యం, అద్భుతం అనదగ్గరీతిలో పుంజుకుంది. జగన్ అస్తవ్యస్థ విధానాలు, ప్రజా వ్యతిరేక పాలన, కక్ష సాధింపు ధోరణి కారణంగా ప్రజలలో తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకత కనబడుతోంది. నాడు అంటే 2019 ఎన్నికల ముందు జగన్ కు కలిసి వచ్చిన ప్రతి అంశమూ ఇప్పుడు వ్యతిరేకంగా మారింది. నాను సానుభూతి వెల్లువెత్తడానికి కారణమైన సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన కోడి కత్తి దాడి ఇప్పుడు జగన్ కు ప్రతికూలంగా మారడమే కాకుండా ఈ రెండు సంఘటనలూ కూడా నాడు చంద్రబాబును ప్రజలలో బదనాం చేయడానికి జగన్ చేత, జగన్ కొరకు జగనే చేయించారన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఆ రెండు సంఘటనల దర్యాపు, కోర్టులలో జరిగిన, జరుగుతున్న విచారణలో వెల్లడౌతున్న అంశాలన్నీ జగన్ వైపే వేలెత్తి చూపుతున్నాయి. అలాగే స్వయంగా వైఎస్ వివేకా కుమార్తె సునీతారెడ్డి, జగన్ సొంత చెల్లెలు వైఎస్ షర్మిల కూడా వివేకా హత్య కేసులో జగన్ తీరునే తప్పుపడుతున్నారు. సునీత అయితే అసలు విలన్ జగనేనా అన్న అనుమానాలు వస్తున్నాయని మీడియా సమావేశంలోనే చెప్పేశారు. వివేహా హత్య కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డికే మళ్లీ కడప టికెట్ ఇచ్చి పక్కన పెట్టుకుని ప్రచారం చేయడంతో జగన్ పట్ల ప్రజలలో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వివేకా హంతకులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని జనం విశ్వసించడానికి దోహదకారిగా మారింది. ఇక ఎన్నికల సమయంలో జగన్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఈసీ కొరడా ఝుళిపించడంతో ఆయన దిక్కు తోచని స్థితిలో పడినట్లైందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మేమందరం సిద్ధం అని చాటుతూ జగన్ ప్రారంభించిన బస్సుయాత్ర తుస్సు మనడమే కాకుండా, ఆ యాత్ర ప్రారంభించిన నాటి నుంచీ జగన్ కు అన్నీ ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. జగన్ బస్సుయాత్ర కడప దాటిందో లేదో కడప లోక్ సభ బరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని జగన్ సోదరి వైఎస్ షర్మిల ప్రకటించారు. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నేరుగా జగన్ ప్రభుత్వం మీద, ఆయన సొంత కుటుంబ సభ్యులను దూరం చేసిన తీరుపైనా నేరుగా విమర్శలు గుప్పిస్తూ.. ఇంత కాలం జగన్ కు అండగా ఉన్న కాంగ్రెస్ సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆయనకు దూరం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే 111 అసెంబ్లీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించిన షర్మిల జగన్ కు గట్టి షాక్ ఇచ్చారు. దీంతో ఇంతకాలం వైసిపి వైపు ఉన్న కాంగ్రెస్ ఓటర్లు మళ్ళీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో కాంగ్రెస్ పోటీ కచ్చితంగా జగన్ కంచుకోటలను బీటలు వారుస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మరోపక్క సునీత రెడ్డి తన తండ్రి హత్య కేసు గురించి సాక్షి మీడియాలోనే జగన్ తోముఖాముఖీకి సిద్ధమని విసిరిన సవాల్ ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తోందనడంలో సందేహం లేదు. ఆ సవాల్ ను స్వీకరించనూలేక, అలాగని సమాధానం చెప్పకుంటే సునీత ఆరోపిస్తున్నట్లుగా వైఎస్ వివేకా హంతకులతో తాను అంటకాగుతున్నట్లు జనం భావిస్తారన్న భయంతో జగన్ దిక్కు తోచని స్థితిలో పడ్డారని అంటున్నారు. అదే సమయంలో పుండుమీద కారం చల్లిన చందంగా జగన్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐజీ సహా ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లపై ఈసీ వేటు వేసింది. వారందరినీ ఎన్నికల విధులకు దూరం చేసింది. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, పల్నాడు ఎస్పీ రవి శంకర్ రెడ్డి, చిత్తూరు ఎస్పీ జాషువా, అనంతపురం ఎస్పీ అంబురాజన్, నెల్లూరు ఎస్పీ తరములేశ్వర్ రెడ్డిలను సరిగ్గా ఎన్నికలకు ముందు విధుల నుంచి తప్పించడం జగన్ ప్రభుత్వానికి నిస్సందేహంగా మింగుడుపడని విషయమే. చంద్రబాబు నాయుడు బీజేపీతో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ నుంచి లేదా కేంద్రంలోని మోడీ సర్కార్ నుంచి కోరుకున్నది కూడా ఇదే. జగన్ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ఎన్నికలలో గెలవాలనే ప్రయత్నిస్తారన్న ఉద్దేశంతోనే దానికి చెక్ పెట్టేందుకే చంద్రబాబునాయుడు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని పరిశీలకులు ఎప్పుడో విశ్లేషించారు. ఇప్పుడు ఆ విశ్లేషణలన్నీ సరైనవేనని తెలుతోంది. ఈ ఐదుగురు ఐపీఎస్ లు, ముగ్గురు ఐఏఎస్ లపై వేటుతోనే ఈసీ ఆగుతుందని భావించలేమని పరిశీలకులు అంటున్నారు. ఇది ప్రారంభం మాత్రమేననీ, రాష్ట్రంలో ఇంకా పలువురు అధికారులు ఇప్పటికీ జగన్ సేవలో తరిస్తున్నారనీ, వారిపై కూడా రానున్న రోజులలో వేటు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయనీ అంటున్నారు. ఇక అన్నిటికీ మించి వాలంటీర్లను పింఛన్ పంపిణీ నుంచి దూరంగా ఉంచాలన్న ఈసీ నిర్ణయం వెనుక చంద్రబాబు ఉన్నారనీ, కుట్రతో వృద్ధులు, వికలాంగులకు పించన్లు అందకుండా చేస్తున్నారనీ ప్రచారం చేసిన వైసీపీకి సచివాలయ సిబ్బంది ద్వారా వారి ఇళ్ళవద్దే పింఛన్లు చెల్లించాలని ఈసీ ఆదేశించడం పెద్ద షాక్ అనడంలో సందేహం లేదు. ఈసీ ఈ నెల 6వ తేదీలోగా అందరికీ పింఛన్లు అందించాలని ఉత్తర్వులు జారీ చేయక తప్పని పరిస్థితిలో జగన్ సర్కార్ పడింది. సచివాలయ సిబ్బంది మూడు రోజులలో అందరికీ పింఛన్లు చెల్లించగలిగితే, మరి ఇంతకాలం లక్షల మంది వాలంటీర్లను ఎందుకు ప్రభుత్వం ఎందుకు పోషించింది అన్న ప్రశ్న జనంలో ఉత్పన్నం అవుతుందన్న భయం కూడా జగన్ ను వెంటాడుతోంది. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి సానుకూలాంశాలుగా మారుతాయని జగన్ వణికి పోతున్నారు. గత ఎన్నికలలో కలిసి వచ్చిన అంశాలే ఇప్పుడు ప్రతికూలంగా మారి ముంచేస్తాయని ఆందోళనలో ఉన్నారు. మరో వైపు తెలుగుదేశం పార్టీకి గత ఎన్నికలలో ప్రతికూలంగా ఉన్న అంశాలన్నీ ఇప్పుడు సానుకూలంగా మారి విజయమే తరువాయి అన్న భరోసాను కల్పిస్తున్నాయి.

# లక్ష్యంగా బిజెపి పావులు...

న్యూఢిల్లీ, సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు బిజీగా ఉన్నాయి. అధికారం కోసం ఎన్డీయే, ఇండియా కూటమి పోటీపడుతున్నాయి. వరుసగా మూడోసారి విజయం సాధించి.. హ్యాట్రిక్ కొట్టే లక్ష్యంతో బీజేపీ దూసుకెళ్తోంది. అడ్డుగా ఉన్న విపక్ష పార్టీలను బొక్కలో తోసే ప్రయత్నాలు మరోవైపు చురుకుగా సాగుతున్నాయి. కేజ్రీవాల్‌ను ఇప్పటికే లోపలేశారు. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఊచలు లెక్కించేలా చేశారు. కాంగ్రెస్ మెడలు వంచి ఐటి కేసులతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవకుంటే మరో ఐదేళ్లు ఆగాల్సి ఉంటుంది. విక్ష పార్టీలతో కలసి ఇండియా కూటమి ఏర్పాటు చేసినందున గెలుపు లక్ష్యంగా పోరాడుతోంది. అయితే నిధుల సమస్య కూడా తీవ్రంగా వెన్నాడుతోంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతో పాటు.. 400 సీట్లను గెలుచుకోవాలనే లక్ష్యంతో బిజెపి వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మరోవైపు ఓట్ల శాతాన్ని 50 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 400 సీట్లు వచ్చినా బీజేపీ 50 శాతం ఓట్లను సాధించగలదా అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. 400 సీట్లు ఒక పార్టీ సాధించడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యం గతంలో కాంగ్రెస్‌కు పోటీగా ఇతర పార్టీలు అంతగా ప్రభావం చూపించకపోవడంతో ఆ పార్టీ ఎక్కువ సీట్లతో అధికారాన్ని చేపట్టగలిగింది. అయితే దేశంలో 400కు పైగా సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ ఎప్పుడూ 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ తన లక్ష్యాన్ని ఎలా చేరుకోగలదా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. స్వతంత్ర భారత దేశంలో ఇప్పటివరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరగాయి. 10 సార్లు మాత్రమే పూర్తి మెజారిటీతో ఒకే పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. కాంగ్రెస్ ఏడుసార్లు, బీజేపీ రెండుసార్లు, జనతా పార్టీ ఒకసారి పూర్తిస్థాయి మెజార్టీ సీట్లు గెలుపొందాయి. 7 సార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాలేదు. దేశంలో ఇప్పటి వరకు అత్యధిక సీట్లు, ఓట్లు 1984లో కాంగ్రెస్ పార్టీ సాధించింది. అదికూడా ఇందిర హత్యానంతరం రాజీవ్ పగ్గాలు చేపట్టినప్పుడు మాత్రమే సాధ్యం అయ్యింది. ఇందిరా గాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది. 415 సీట్లను గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 50 శాతం దాటలేదు. ఇందిరా గాంధీ హత్య తర్వాత దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది, ఇది ఇప్పటి వరకు అతిపెద్ద రికార్డు. కాంగ్రెస్ 7 సార్లు పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఒక్కసారి కూడా 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ప్రస్తుతం బీజేపీ మాత్రం 2024 ఎన్నికల్లో 400 సీట్లు



గెలవడమే కాకుండా 50 శాతం ఓట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024 ఎన్నికల్లో తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు బీజేపీ అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. 50 శాతం ఓట్లు దాటాలంటే బీజేపీకి 2019 కంటే 12 శాతం అధికంగా ఓట్లు రావాలి. దీనికోసం ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు చిన్న పార్టీలతో బీజేపీ చేతులు కలిపింది. ఇప్పటి వరకు ఉత్తరాదిలోనే అత్యధిక సీట్లు సాధించిన బిజెపి ఇప్పుడు దక్షిణాదిలో కూడా సీట్లు సాధించేలా పొత్తులకు శ్రీకారం చుట్టింది. అయోధ్యతో కొంత మార్పు వచ్చిందని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో కమలం పార్టీ తన లక్ష్యాన్ని చేరుకుంటుందా లేదా అనేది జూన్4న తేలిపోనుంది.

## హుండీలో చేయిపెట్టి దొరికి పోయాడు

కామారెడ్డి,పనిచేస్తున్న గుడిలోనే దొంగతనం చేయాలనుకున్న వ్యక్తి. దురదృష్టవశాత్తు దొరికిపోయాడు. దొంగతనం చేస్తుండగా హుండీలో చెయ్యి ఇరుక్కుపోవడంతో దొరికిపోయాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో జరిగింది. మండలంలోని రామేశ్వరపల్లిలో ఉన్న మాసుపల్లి పోచమ్మ ఆలయంలో సురేశ్ అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. అతను హుండీలో ఉన్న డబ్బును ఎత్తుకెళ్లాలని దురాలోచన చేశాడు. మంగళవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించాడు. హుండీ పైభాగాన్ని ధ్వంసం చేసి అందులోనుంచి డబ్బును బయటకు తీయడానికి ప్రయత్నించాడు. అయితే చెయ్యి హుండీలో ఇరుక్కుపోవడంతో తీయడానికి శ్రమించాడు. ఎంతకూ అది బయటకు రాకపోవడంతో అలాగే ఉండిపోయాడు. ఉదయం అతడిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కట్టర్ సహాయంతో హుండీని కత్తిరించి చెయ్యిని బయటకు తీశారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# వేసవి ఎండల్లో అగ్నిప్రమాదాలు

ఆదిలాబాద్,వేసవి ఎండలు తీవ్రం అవుతున్నందున అగ్నిప్రమాదాలు జరక్కుండా గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. అలాగే అడవుల్లో మంటలు చెలరేగకుండా అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. రైతులు వరి పొలాల్లో చెత్తను కాలబెట్టే సమయంలో సమీప అటవీ సంపదకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతుందని, దానిని కాపాడేందుకు స్థానిక వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని గ్రామ సంరక్షణ కమిటీలు, వీఆర్వోలు గ్రామంలోని వారందరికీ అటవీసంపద కాపాడుకునే అంశాన్ని వివరించాలన్నారు. ఇకపోతే ఎండాకాలంలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాపిడి కావడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి ఎండిన ఆకులపై పడి మంటలు వ్యాపించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై గతంలోనూ ముందస్తు హెచ్చరికలుచేశారు. గ్రామ పటాలు, రైతుల భూములు తదితర వివరాలు దగ్గర పెట్టుకుని ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తహసీల్దార్లకు తెలియజేయాలని సూచించారు. ఆ తర్వాత మండల నివేదికలను డీఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు.

# 9నుంచి ఇంద్రకీలాద్రిపై ఉగాది ఉత్సవాలు

విజయవాడ, ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ దేవాలయంలో ఈనెల 9 నుంచి క్రోధి నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు దుర్గగుడి ఈవో రామారావు వెల్లడించారు. బుధవారం చైత్ర మాస బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 9వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు ప్రత్యేక పుష్పార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉగాది రోజున మధ్యాహ్నం 3 గంటలకు పంచగ శ్రవణం జరుగుతుందన్నారు. తంగిరాల ప్రభాకర్ సిద్ధాంతి పంచగా శ్రవణాన్ని పఠిస్తారని అన్నారు. సాయంత్రం 6 గంటలకు వెండి రథం నగర ఉత్సవానికి వెళ్తుందన్నారు. ఉగాది రోజు ఆర్జిత సేవలు కొన్ని నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఉగాది రోజున ఉదయం 8 గంటల నుంచి దుర్గమ్మ దర్శనాలు ప్రారంభం అవుతాయన్నారు. ఏప్రిల్ 9వ తేదీ నుండి 18వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పుష్పార్చన సేవలు ఉంటాయన్నారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో దుర్గా మల్లేశ్వర స్వామివార్లకు పుష్పాలు సమర్పించాలనుకునే వారు ఒక రోజు ముందుగా తెలియజేయాలని ఈవో విజ్ఞప్తి చేశారు. 19వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వార్ల చైత్రమాస బ్రహ్మోత్సవ కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు వాహన సేవలు ఉంటాయన్నార. ఈ నెల 22 న రాత్రి 10.30 నిముషాలకు శ్రీ దుర్గా మల్లేశ్వర దివ్య కల్యాణమహోత్సవం జరుగుతుందన్నారు. 24న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి.. సాయంత్రం శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లకు పవిత్ర క్రుష్ణానదిలో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దుర్గగుడి ఈవో రామారావు పేర్కొన్నారు. 9 న అమ్మవారికి మ్లలెపూలు, మరువముతో అమ్మవారికి ప్రత్యేక పుష్పార్చనలు10 న కనకాంబరాలు, గులాబీలతో పూజలు, 11 న చామంతి, ఇతర పుష్పములు, 12 న మందార పుష్పములు, ఎర్ర కలువలు,13 న తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువము, ధవళము,14 న కాగడా మల్లెలు, జూజులు, మరువము, 15 న ఎర్ర తామర పుష్పములు, ఎర్ర గన్నేరు, సన్నజాజులు, 16 న చామంతి, సంపంగి పుష్పములు, 17 న కనకాంబరాలు, గులాబీ,18 న కనకాంబరాలు, వివిధ రకాల పుష్పములతో ప్రత్యేక పుష్పార్చనలు చేపడతామని అన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న ఎండలు

హైదరాబాద్, వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోగా, వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడు తున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో .. పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ.. ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే ముమ్మందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయంటే సూర్యుడి విశ్వరూపం ఏ రేంజ్‌లో ఉందో అర్థంచేసుకోవచ్చు. ఒకవైపు ఎండలు దంచికొడుతుంటే, ఇంకోవైపు వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణలో 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 37 మండలాలకు వార్నింగ్ ఇచ్చింది. అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని ఐఎండీ చెబుతోంది. ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది ఇప్పుడున్న ఉష్ణోగ్రతలు శాంపిల్స్ మాత్రమేనని, ముందుముందు ఇంకా పెరుగుతాయంటోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిస్తోంది వాతావరణశాఖ. అందుకే అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని చెబుతోంది. తెలుగు రాష్ట్రాల్లో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సాధారణం కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు

# ఖమ్మం,కరీంనగర్‌లపై వీడని ఉత్కంఠ

న్యూఢిల్లీ,వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కడియం కావ్యకు కేటాయించింది. అయితే ఖమ్మం విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టత రావడం లేదు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉండడం కారణంగా చెబుతున్నారు. వరంగల్‌లో కావ్యకు సీటుతో సమీకరణాలు మారుతున్నాయి. ఈ మేరకు సోమవారం రాత్రి ఏఐసీసీ అధికారిక ప్రకటన చేసింది. భారాస అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆ అవకాశాన్ని వదులుకొని తండ్రి కడియం శ్రీహరితోపాటు కాంగ్రెస్‌లో చేరిన ఆమెకు అనుకున్నట్లుగానే సీటు కేటాయించారు. దీంతో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలోని 14 సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. ఖమ్మం స్థానంపై కాంగ్రెస్‌లోని అన్నివర్గాలూ గురిపెట్టడంతో పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయానికి రాలేకపోతోంది. ఇప్పటివరకు ఈ స్థానం కోసం వరంగల్ మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ్‌కుమార్ పోటీపడుతున్నారు. తాజాగా అదే జిల్లాకు చెందిన ఓ మీడియా సంస్థ అధిపతి కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం. దీంతో ఈ సీటుపై నెలకొన్న ఉత్కంఠ మరింత ఎక్కువైంది. సీఈసీ సమావేశానంతరం రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క.. కేసీ వేణుగోపాల్ ఇంటికివెళ్లి ఈనెల 6న తుక్కుగూడలో తలపెట్టిన కాంగ్రెస్ జనజాతర సభ సన్నాహక ఏర్పాట్లపై చర్చించారు. సభ నాటికి అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నేతృత్వంలో జరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) సమావేశంలో పెండింగ్ స్థానాలపై చర్చించారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. కమిటీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర పనుల వల్ల హాజరుకాలేకపోయారు. వరంగల్ అభ్యర్థిపై మాత్రమే ఏకాభిప్రాయం కుదరడంతో అధికారికంగా ప్రకటించారు. మిగిలిన మూడు స్థానాలకు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పేర్లు పరిశీలనలో ఉండటంతో వాటి ప్రకటనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ స్థానానికి ఇబ్రహీం అలీ మస్కతీ, సమీర్‌ఖాన్‌లలో ఎవరో ఒకరి పేరును ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కరీంనగర్ అభ్యర్థిత్వం మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు, తీన్మార్ మల్లన్నల మధ్య దోబూచులాడుతోంది. ఇందులో రాజేందర్‌రావుకు సిటింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మొగ్గు కొంత ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో స్థానిక సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని ఎవరో ఒకరి పేరును ఖరారు చేయొచ్చన్న అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

# ఫలరాజు నారాజ్! దిగుబడి లేని మామిడి

కడప: ఉద్యాన పంటల్లో ఫలరాజంగా ప్రసిద్ధి చెందిన మామిడికి గడ్డు పరిస్థితులు దాపురించాయి. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా పూత సకాలంలో రాలేదు. ఆలస్యంగా వచ్చిన పూత కూడా నిలవకుండా మాడిపోయింది. ఫలితంగా ఏపీలో మామిడి దిగుబడి ఏడాదికేడాదికి గణనీయంగా తగ్గుతోంది. మామిడిపండ్ల సాగు, దిగుబడిలో అగ్రస్థానంలో ఉన్న ఏపీ క్రమంగా తన స్థానాన్ని కోల్పోతోంది. రాష్ట్ర విభజన తర్వాత మామిడి పంటలో ఏపీని వెనక్కి నెట్టి ఉత్తరప్రదేశ్ ముందంజలో ఉందని అగ్రికల్చర్ అండ్ ప్రోసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ డెవలప్ మెంట్ అథారిటీ (ఏపెడా) గణాంకాలు చెబుతున్నాయి.



సాగు విస్తీర్ణం, దిగుబడిలోనూ యూపీ టాప్

సాగు విస్తీర్ణం, దిగుబడి రెండింటిలోనూ యూపీదే మొదటి స్థానం. ఆంధ్ర ప్రదేశ్ రెండో స్థానంలో ఉంటే, కర్ణాటక, తెలంగాణ, బిహార్, గుజరాత్ వంటివి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏటేటా మారుతున్న పరిస్థితులకు తోడుగా వాతావరణ అననుకూలత కారణంగా దిగుబడి తగ్గుతోంది. సాగు విస్తీర్ణం కూడా కుచించుకుపోతోంది. తెలంగాణలో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ వంటి కొన్ని ప్రాంతాల్లోనే మామిడి పంట ఉంది. కానీ ఏపీలో మాత్రం శ్రీకాకుళం నుంచి కడప, చిత్తూరు వరకూ అన్ని జిల్లాల్లో మామిడి సాగవుతోంది.

లెక్కలను పరిశీలిస్తే..

ప్రపంచంలోనే మామిడిపళ్ల ఉత్పత్తిలో భారత్‌ది మొదటిస్థానం. కేంద్ర ప్రభుత్వ హార్టీకల్చర్ బోర్డు లెక్కల ప్రకారం 2023లో దేశంలో ఉత్పత్తయిన మామిడిలో ఉత్తరప్రదేశ్ 23.06 శాతం ఉత్పత్తి చేస్తోంది. ఏపీ నుంచి 16.07 శాతం ఉత్పత్తి అవుతోంది. తెలంగాణ నుంచి 8.54 శాతం మామిడి వస్తోంది. ఏపీ ప్రభుత్వ ఉద్యాన శాఖ లెక్కల ప్రకారం 2022-23లో రాష్ట్రంలో 4.03 లక్షల హెక్టార్లలో మామిడి పంట ఉంది. దాని నుంచి 59.06 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి జరిగింది. రాష్ట్ర విభజన నాటితో పోలిస్తే ఏపీ ప్రభుత్వ అధికారిక లెక్కల్లో కూడా దిగుబడి తగ్గింది. అనేక చోట్ల రైతాంగం మామిడి తోటల స్థానంలో ఇతర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మామిడి ఏటా వేసవి సీజన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. మూడు నెలల పాటు పంట ఉంటుంది. సరిగ్గా ఆ సమయానికి వాతావరణం అనుకూలించకపోతే పంట నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఏప్రిల్, మే నెలల్లో వచ్చే ఈదురుగాలులు, వర్షాల భయం మామిడి రైతులను వెంటాడుతూ ఉంటుంది. దానికి ముందు మంచు ఎక్కువగా కురవడం, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి అననుకూల పరిస్థితులు మామిడి రైతులను వేధిస్తుంటాయి.

బంగినపల్లి, బెనిషాకే డిమాండ్..

మామిడి పంట ఎక్కువగా ఎగుమతుల మీద ఆధారపడి సాగు చేస్తారు. ఎగుమతులకు డిమాండ్ ఉన్న పంటలకే ధర పలుకుతుంది. అందులో ఏపీలో పండించే ముఖ్యంగా బంగినపల్లి, బెనిషా, మల్లూరా, రెడ్ పసంద్, సువర్ణరేఖ, తోతాపురి, కోలంగోవ, పణుకులు వంటి రకాలకు మార్కెట్ ఉంటుంది. చిన్న రసాలు, పెద్ద రసాలు, నీలం వంటి రకాల్లో పెద్దగా ఎగుమతికి అవకాశం ఉండదని రైతులు చెబుతున్నారు. మామిడి చాలావరకు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. 2022-23 లెక్కల ప్రకారం భారత్ నుంచి 27,872.78 మెట్రిక్ టన్నుల మామిడి ఎగుమతి అయ్యింది. ప్రధానంగా యూఏఈ, యూకే, ఖతార్, ఒమన్ వంటి దేశాలకు సుమారుగా రూ 327.45 కోట్ల విలువైన మామిడి ఎగుమతి అయ్యింది. అదేవిధంగా దేశంలోని దిల్లీ, కలకత్తా, బరంపురం, భువనేశ్వర్, కటక్, పట్నా, బెనారస్, ఛత్తీస్ గఢ్, పంజాబ్ తదితర ప్రాంతాలకు కూడా వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

పూత పట్టక.. వచ్చినది నిలవక..

మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. చెట్టుకు ఒక కాయ కూడా లేదంటే నమ్ముతారా?. ఈసారి సీజన్ రాకముందే రైతుల్లో కలవరం మొదలైంది. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో మామిడి చెట్లకు పూత వస్తుంది. జనవరిలో మొగ్గలతో పూత విరివిగా కనిపించాలి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 50 శాతం చెట్లలోనే పూత కనిపించింది. రైతులు, వ్యాపారులు అవగాహన లోపంతో మామిడి చెట్ల పూత నిలపాలని మందులు పిచికారీ చేస్తుండడంతో అప్పుడే పూసిన పుప్పొడి రాలిపోయి నష్టం వాటిల్లుతోంది. అరకొరగా కాసిన మామిడి కాయలు కూడా, తేనె మంచి తెగుళ్లు తామర తెగుళ్లు, వైరస్ సోకడం వంటి ప్రకృతి ప్రతికూల పరిస్థితులన్ని కూడా మామిడి సాగు లో దిగుబడి గణనీయం తగ్గి పోయేందుకు కారణం అయ్యాయి. సగటున ఎకరాకు 5నుంచి 6 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఈ ఏడాది మధ్యస్తంగా కూడా ఉంటుందో లేదో అని ఆందోళన కనిపిస్తోంది. సేద్య పద్ధతుల మీద అవగాహన లేకపోవడం వల్ల సస్యరక్షణ పేరుతో ఎక్కువగా రసాయనాలు వాడుతున్నారు. దానివల్ల మామిడి పూత, పిందె దశలో రాలిపోతున్నాయి. అలాంటి వాటి మీద అవగాహన పెంచుకోవడం, ఏటా మామిడి తోటలకు నీటి సదుపాయం కల్పించడం వంటి చర్యల ద్వారా దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంది. మామిడి దిగుబడులు తగ్గుతున్న దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి రైతులకు అవగాహన పెంచే ప్రయత్నం చేస్తోంది.

# పెన్షన్లు ఆపించి.. మొసలి కన్నీరు

అమరావతి,పింఛన్లు ఆపించి తగుదునమ్మా అంటూ చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నాడని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మేరుగ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పరిస్థితి చూస్తుంటే ఎంతటికైనా దిగజారి రాజకీయాలు చేసి, రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచాలని చూస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. 'ఈ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుపై బాధ్యతగా ఉండే రాజకీయ నాయకుడిలా చంద్రబాబు లేనే లేడు. స్వయాన ఆయన బంధువు నిమ్మగడ్డ రమేష్ అనే వ్యక్తిని పక్కన పెట్టుకుని వాలంటీర్ వ్యవస్థపై కుట్రలు చేశాడు. నిమ్మగడ్డ సర్వీసులో ఉన్నప్పుడు మాపై కుట్రలు కుతంత్రాలతో పనిచేశాడు. ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వానికి బద్ధ విరోధిలా పనిచేశారు. ఆయనే ఈ రోజు దేశంలోనే గొప్ప సంస్కరణగా నిలిచిన వాలంటీర్ వ్యవస్థపై కత్తి కట్టాడు. పేద ప్రజలు, నిస్సహాయులను ఆదుకోడానికి, సంక్షేమ కార్యక్రమాలను సక్రమమైన పద్ధతిలో చేరవేసే ఉద్దేశంతో వాలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ పెట్టారు. అలాంటి వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా పింఛన్లు పంచకూడదని నీ బంధువు ద్వారా కోర్టులకు, ఎన్నికల కమిషన్‌కు వెళ్లి ఆ వ్యవస్థను నిలిపేశావంటే ఎంత దిగజారావో అర్థం అవుతోంది. వాలంటీర్లు పింఛన్లు పంచకూడదని కేసులు వేయించి, తగుదునమ్మా అంటూ మళ్లీ పింఛన్లు పంచాలంటే సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నావు. రాష్ట్రంలో వాలంటీర్లు ఎలాంటి సర్వీసులు చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసు. వాలంటీర్ వ్యవస్థను ఆపి రాజకీయంగా లబ్దిపొందాలనేదే చంద్రబాబు ఆలోచన. ఏదో ఒక విధంగా గందరగోళం సృష్టించి లబ్దిపొందాలనే ఆలోచనతోనే చంద్రబాబు ఈ తప్పుడు చర్యకు పాల్పడ్డాడు. ఈ రోజు పింఛన్లు రాక అనేక ఇబ్బందులు పడటానికి కారణం చంద్రబాబే.ఇదంతా చేసి ఎందుకు పింఛన్లు పంచలేదని ఇప్పుడు నువ్వే మాట్లాడుతున్నావు. అంతా నువ్వే చేసి తగుదునమ్మా అంటూ మెసేజ్‌లు పెట్టడం ఏంటి? ఎవరితో ఆపించావో నీకు తెలుసు. ఆపించిన వ్యక్తి ఎవరో నీకు తెలుసు. నువ్వు ప్రజల్ని మోసం చేయడానికి ఎక్స్(ట్విట్టర్)లో మెసేజ్‌లు పెడుతున్నావు. నువ్వొచ్చాక పింఛన్లు ఇస్తావా? నువ్వు వచ్చేది ఏంటి బోడిగుండు? నువ్వు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల్లో హామీ ఇస్తున్నావు. ఈ రాష్ట్రంలో నువ్వు ఏదవలేక, 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టుకోలేక అరువు తెచ్చుకున్నావు. ఎస్సీ, ఎస్టీలను అపహాస్యం చేశావ్..ఎస్సీల్లో పుట్టకూడదు అని చెప్పావు. బీసీల తోకలను కత్తిరిస్తానన్నావు..బీసీలు జడ్జిలుగా పనికిరానన్నావు. నువ్వు డబ్బులున్న వారి అడుగులకు మడుగులు వత్తుతున్నావు. నా పేదవాళ్లు, నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. టిప్పర్ డ్రైవర్లే నిన్ను పాతాళానికి తొక్కేస్తారు చూడు చంద్రబాబు. టిప్పర్ డ్రైవర్‌కి టికెట్ ఇచ్చారంటూ మాట్లాడతావా? ఎంత మదంతో ఉన్నావు.. మా పల్లెల్లోకి వచ్చి నువ్వు ఓట్లు అడుగుతావా? ఈ రాష్ట్రంలో రాజ్యాంగాన్ని నువ్వు అపహాస్యం చేస్తే పేదవారి స్థితిగతులను మార్చడానికి సీఎం జగన్ పనిచేస్తున్నారు. టిప్పర్ డ్రైవర్‌గా ఉన్న నా ఎస్సీ సోదరుడికి...అంబేద్కర్ గారు కల్పించిన అవకాశాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నారు. మా డ్రైవర్లు అంటే నీకు అంత తేలిక. ఆటోలు, టిప్పర్లు, లారీలు నడుపుతున్న ప్రతి డ్రైవర్ చంద్రబాబు అంతాన్ని పంతంగా తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి సిద్ధంగా ఉన్నారు. చరిత్ర పునరావృతం అవుతుంది. కాసుకో చంద్రబాబూ..నీ కుట్రలు, కుతంత్రాలు సీఎం జగన్ ముందు చెల్లవు. మా పార్టీలో ఉన్నదంతా పేదలు. వారే జగన్ గారిని అక్కున చేర్చుకుంటున్నారు. ఏ బ్లేడో, ఏ కత్తో..ఎక్కడ జరిగిందో పవన్ కల్యాణెళి చెప్పాలి. విలువలు లేని మాటలు, విశ్వసనీయత లేని మాటలు పవన్ కల్యాణ్ మాట్లాడుతుంటే మేమెందుకు సమాధానం చెప్పాలని, వారెన్ని మాటలు మాట్లాడినా ప్రజలు వారిని తుంగలో తొక్కుతారు' అని మేరుగ మండిపడ్డారు.

# ఐటీ ఫోకస్!

న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు లావాదేవీలపై ఈసీ నిఘా పెట్టింది. రూల్స్ మరింత కఠినతరం చేసింది. పౌరుల బ్యాంకు అకౌంట్లలో ట్రాన్సాక్షన్ పై దృష్టిసారించింది. ఇప్పటికే ఎన్నికల వేళ సాధారణ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో.. కొత్త ఆర్థిక ఏడాదితో పాటు, ఎన్నికల నిబంధనలు ప్రజలకు మరింత చుక్కలు చూపనున్నాయి. ఏప్రిల్ 1నుంచి ఎన్నికలతో ఎటువంటి సంబంధం లేని సాధారణ ప్రజలకు కూడా ఎన్నికల సంఘం విధించిన మార్గదర్శకాల రాక గుబులు పుట్టిస్తోంది. కొత్త ఆర్థిక ఏడాది నేపథ్యంలో నగదు, బ్యాంకు డిపాజిట్లపై ఈసీ కీలక సూచనలు చేసింది. సరికొత్త నిబంధనలను తెరపైకి తెస్తూ ఆర్బీఐ అమలులోకి తీసుకొస్తోంది. సాధారణ పౌరుల ఖాతాపై నిఘా పెట్టి.. రెండు నెలల్లో రూ.లక్షకు మించి డిపాజిట్ చేసిన అకౌట్ల డిటెయిల్స్ ఐటీ శాఖతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ కు పంపాలని ఆదేశించింది.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా

పార్లమెంట్ ఎన్నికల వేళ ఈసీ అనుమానాస్పద లావాదేవీలపై నిఘా పెట్టింది. ఇప్పటికే ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రంలో పెండ్లిళ్లు, ఆస్పత్రి ఖర్చులకు కూడా సాధారణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అనేక రకాలుగా ఈసీ నిబంధనల చట్రం అమలు చేస్తున్న తీరు గుర్తించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సంరంభానికి తెర లేచిన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ పార్టీలు, అభ్యర్థులు డబ్బు విరివిగా పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలంగాణలో డబ్బు ప్రభావం ఎక్కువని ఈసీ అనుమానిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రక్రియ సాగుతున్న వేళ.. బ్యాంకుల్లో అనుమానాస్పదంగా సాగే ఆర్థిక లావాదేవీలపై నిఘా పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

లక్షకు మించి డిపాజిట్?.. తనిఖీ చేయాలని ఆదేశాలు

ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారుల (సీఈఓ)కు సీఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల్లో ?లక్ష పైచిలుకు డిపాజిట్, విత్ డ్రాయల్ చేసిన అకౌంట్స్, ఒకే జిల్లాలో పలువురికి ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసిన ఖాతాల వివరాలను సేకరించాలని పేర్కొంది. బ్యాంకుల్లో ? లక్షకు మించి డిపాజిట్ చేసిన అభ్యర్థి, ఆ అభ్యర్థి కుటుంబ సభ్యులు, పార్టీల ఖాతాల వివరాలను సేకరించాలని సీఈఓలను ఈసీ ఆదేశించింది. ? 10 లక్షలు డిపాజిట్ చేసిన ఖాతాల వివరాలను ఆదాయం పన్ను విభాగం అధికారులకు అందజేయాలని సూచించింది. జిల్లా ఎన్నికల అధికారులు అన్ని బ్యాంకుల నుంచి సమాచారం తెప్పించుకోవాలని, ఆ డేటాలో అనుమానాస్పదమైన లావాదేవీలు ఉంటే వాటి వివరాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఇవ్వాలని పేర్కొంది.

నగదు జమ, విత్ డ్రాపై ఐటీ నిఘా

దేశంలో, రాష్ట్రంలో పలు బ్యాంకులు జీరో బ్యాలెన్స్ అకౌంట్లను అందిస్తుండగా, మరి కొన్ని బ్యాంకులు మినిమం బ్యాలెన్స్‌తో సేవింగ్స్ అకౌంట్ సేవలు అందిస్తున్నాయి. బ్యాంకు ఖాతాలలో అకస్మాత్తుగా అత్యధిక మొత్తంలో నగదు జమ, నగదు విత్‌డ్రాలపై ఐటీ శాఖ నిఘా పెంచింది. పరిమితికి మించితే భారీగా పెనాల్టి లను వసలూ చేసి విచారణ జరిపేందుకు నిర్ణయించింది. ఈ నిబంధన ప్రకారం సాధారణ సేవింగ్స్ అకౌంట్‌లో ఆర్థిక సంవత్సరానికి (ఏప్రిల్ %--% మార్చి ) క్యాష్ డిపాజిట్ పరిమితి రూ.10 లక్షలుగా నిర్ణయించారు. రూ.10 లక్షలకు మించి లావాదేవీలు జరిపితే బ్యాంకులు వెంటనే ఆదాయపు పన్ను శాఖకు సమచారాన్ని అందించనున్నాయి. ఆ వెంటనే దసరు అనుమానిత లావాదేవీలపై ఐటీ శాఖ ఖాతాదారుకు నోటీసులు జారీ చేయనుంది. రూ. 10 లక్షలకు మించిన డిపాజిట్లకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ఆధారాలు ఖాతాదారు చూపాల్సి రానుంది. కరెంటు ఖాతాలకు ఆర్థిక సంవత్సరానికి రూ.50 లక్షల వరకు పరిమితి ఉంటుందని, ఆదాయపు పన్ను చట్టం 1962, సెక్షన్ 114బీ ప్రకారం ప్రతి బ్యాంకు రూ. 10 లక్షలకు మించి లావాదేవీలు జరిగిన ఖాతాల వివరాలను ఐటీ శాఖకు అందిచాల్సి ఉంటుందని వెల్లడించింది.

# పెన్షన్ల పంపిణీపై వైసిపి -టీడిపి లడాయి..



అమరావతి: పెన్షన్ ల పంపిణీలో వాలంటీర్లను దూరంగా ఉంచాలన్న నిర్ణయంపై వైసిపి , టిడిపి నేతల మధ్య యుద్ధం తారస్థాయికి చేరింది.. చంద్రబాబే పెన్షన్లను నిలిపి వేయించారంటూ వైసిపి అగ్గిమీద గుగ్గిలం అవుతుంటే , వాలంటీర్ల లేకుండా ఇంటింటి పంపిణీ చేయడం జగన్ సర్కార్ కు చేతకాదా అంటూ టిడిపి నేతలు కౌంటర్ ఇస్తున్నారు..

పెన్షన్లు ఇస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు..

వయోభారం, అనారోగ్యం కారణంగా మంచానపడి లేవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు వలంటీర్ల ద్వారా వారి గడప ముందుకు వచ్చి పెన్షన్ ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అండ్ కో కుట్రలు చేసి పెన్షన్‌ను అడ్డుకోవడం దారుణమని వైయస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి మండిపడ్డారు. గ్రామ సచివాలయం వద్దకు వెళ్ళి పెన్షన్ తీసుకోలేని వృద్ధులను మంచంపై పడుకోబెట్టి సచివాలయం వరకూ తీసుకెళ్ళే నిరసనకు విజయసాయిరెడ్డి మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఎన్నికల సంఘం ఇప్పటికైనా వాస్తవం తెలుసుకుని కుట్రపూరితమైన చంద్రబాబు ఫిర్యాదులను నమ్మకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. మీ పదవీకాంక్ష కోసం ఎంతమంది పెన్షనర్ల ప్రాణాలు బలి తీసుకుంటావు చంద్రబాబు? అంటూ విజయసాయిరెడ్డి నిలదీశారు.

ఈసీ ఆదేశాలకు జగన్ సర్కార్ మంగళం .. .

ఈసీ ఆదేశాల మేరకు ఏపీలో ఇవాళ సచివాలయాల ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. అయితే, వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే పెన్షన్లు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, వైసీపీ కార్యకర్తలు ఆ ఆదేశాలను ధిక్కరిస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. పెన్షన్లకు సంబంధించి నగదు ఇప్పటికీ నగదు సచివాలయాలకు అందలేదని వర్ల రామయ్య తెలిపారు. వైసీపీ కార్యకర్తలు వృద్ధులను మంచాలపై సచివాలయాలకు మోసుకొస్తున్నారని, వైసీపీ కార్యకర్తలు ఈసీ ఆదేశాలను ఉల్లంఘిస్తుంటే అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇళ్ల వద్దే పెన్షన్లు అందించేలా ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

మంచాలపై తీసుకొస్తారా.. వైసిపిపై ఉమా ఫైర్

ఇదే అంశంపై టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా కూడా స్పందించారు. పెన్షన్ల కోసం వృద్ధుల్ని ఇబ్బంది పెడతారా? ప్రచార పిచ్చితో వృద్ధులను మంచాలపై ఊరేగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ప్రతిపక్షాలపై విషప్రచారం చేస్తున్న వైసీపీ నేతలపై ఈసీ చర్యలు తీసుకోవాలని దేవినేని ఉమా విజ్ఞప్తి చేశారు. ఓట్ల కక్కుర్తితో వైసీపీ నేతలు, అధికారులు మానవత్వం లేకుండా ప్రవర్తిస్తారా? అని ధ్వజమెత్తారు. తొమ్మిది మంది అధికారులపై ఈసీ చర్యలు తీసుకున్నా ఇంకా మార్పు రాదా? అని ప్రశ్నించారు. అస్మదీయులకు ఖజానా దోచిపెట్టారని, దాంతో సచివాలయాలకు ఇంకా పెన్షన్ డబ్బు చేరలేదని ఆరోపించారు.

కొన్ని ప్రాంతాలలోనే ప్రారంభం

ఇది ఇలా ఉంటే నేటి ఉదయం నుంచి మొదలు కావాల్సిన పెన్షన్ల పంపిణీ ప్రక్రియ ఆలస్యం కావడంతో వృద్ధులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. పెన్షన్ల కోసం ఉదయం నుంచే సచివాలయాలకు పెన్షన్‌దారులు చేరుకున్నారు. సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయితే డబ్బులు రాలేవని, మధ్యాహ్నం నుంచి పెన్షన్ పంపిణీ ప్రక్రియ మొదలవుతుందని సచివాలయం సిబ్బంది చెబుతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచే పెన్షన్లు పంపిణీ చేస్తామని ఎందుకు చెప్పారంటూ పెన్షన్‌దారులు మండిపడుతున్నారు. చివరకు పెన్షన్ పంపిణీ లేకపోవడంతో ప్రజలు వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈరోజు నుంచి ఈనెల 6వరకు నాలుగు రోజుల పాటు పెన్షన్ పంపిణీ జరుగనుంది.

# పసుపు బోర్డు ఎక్కడ ?

నిజామాబాద్ , పదే పదే పసుపు బోర్డుపై మాట్లాడుతున్న ఎంపీ అరవింద్ పసుపు బోర్డు అసలు హైదరాబాద్ లోనా, నిజామాబాద్ లో ఏర్పాటు చేస్తావా పసుపు బోర్డు ఎక్కడ అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. నరేంద్ర మోడీ పసుపు బోర్డుకు జీవో ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో విది విధానాలు తెలియజేయలేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ%ొా% ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పోరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే భారీ మెజారిటీతో గెలుస్తామనే నమ్మకం కలిగిందని కాంగ్రెస్ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేని బిజెపి ప్రభుత్వమని తెలిపారు. సంవ త్సరానికి రెండు కోట్ల ఉద్యోగలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. తమ పార్టీ జాతీయ పార్టీ, ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా బిఆర్ఎస్ వైఫల్యం చెందటంతోనే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. బిజెపి పార్టీ నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం దారుణమన్నారు. విదేశాల్లో మూలుగుతున్న నల్ల ధనం తెచ్చి ప్రతి పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ15 లక్షల రూపాయిలు వేస్తామని చెప్పిన నాయకులు ఇప్పటి వరకు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు.

ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీలను త్వరలో తెరిపిస్తాం

జాతీయ స్థాయిలో మార్పు రావాలని రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్ పరం చేసిందని, రైల్వేలు, రోడ్లు ప్రైవేటీకరణ చేసిందని ఆయన విరుచుకుపడ్డారు. 2001లో చంద్రబాబు షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మితే, 2015 కవిత ఉన్న చక్కెర ఫ్యాక్టరీలు మూసి వేయించిందని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా త్వరలోనే ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి తెలిపారు. అధికారంలోకి రాగానే పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో బోధన్, మెట్ పల్లి షుగర్ ఫ్యాక్టరీలు సందర్శించడం జరిగిందన్నారు. 2025 చివరి నాటికి మూత పడిన చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఎన్ఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. 2015 సంవత్సరంలో ఎంపీ హోదాలో ఉన్న కవిత రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడిందని ఆరోపించారు. 2019లో రైతులకు పసుపు బోర్డు తీసుకువస్తానని నమ్మించి బాండ్ పేపర్ ఇచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఎంపీ అరవింద్ గెలిచాడన్నారు. నిజామాబాద్ కూడా స్మార్ట్ సిటీగా గుర్తింపు పొందే విధంగా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తామని, విద్య వైద్య ఉపాధి పరంగా మెరుగైన వసతులు కల్పించేలా ముందుకు వెళ్తామన్నారు.

# కేసీఆర్ కి శని పట్టుకుందా...!?

హైదరాబాద్,ఆయన నాలుగు నెలల క్రితం వరకూ మధ్యాహ్నం మార్తాండుడుగా వెలిపోయారు. తేరిపారా ఆయనను చూడడం ఎవరి వశం అయ్యేది కాదు. ఆ రాజభోగం, ఆ దర్జా ఆ అధికార శాసనం ఇవన్నీ చూస్తూండగానే కనుమరుగు అయిపోయాయి. ఓడలు బళ్లు అవుతాయని సామెతను కేసీఆర్ ని చూస్తే మరోసారి చెప్పుకోవాలి. / ఎలా ఉన్న కేసీఆర్ ఎలా అయిపోయారో అన్న చర్చ సాగుతోంది. తాను పట్టినదల్లా బంగారం అన్నట్లుగా కేసీఆర్ పొలిటికల్ టూర్ సాగింది. 1981లో కాంగ్రెస్ లో చేరిన కేసీఆర్ కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఎన్టీయార్ కంట్లో పడి టీడీపీ అభ్యర్థిగా సిద్ధిపేట నుంచి పోటీ చేయడం అంటే ఆయన రాజకీయ పరుగు ఎలా మొదలైంది అన్నది అర్థం అవుతుంది. మొదటి ఎన్నికల్లో ఓటమి పాలు అయినా లీడర్ గా సక్సెస్ అయ్యారు. ఆ పునాది మీదనే ఆయన 2000 దాకా టీడీపీలో ఎదిగారు. 2001లో టీడీపీని వీడిన నాటికి కూడా ఆయన మాజీ మంత్రి డిప్యూటీ స్పీకర్ గా ఉన్నారు. ఇక తెలంగాణా రాష్ట్ర సమితి పెట్టాక దేశం మొత్తం ఆయన వైపు చూసేలా చేసుకున్నారు. ఆ దూకుడు 2014 దాకా అప్రతిహతంగా కొనసాగింది. ఎన్ని సీట్లు ఎన్ని ఓట్లు నాటి టీఆర్ఎస్ రాబట్టింది అన్నది కాదు కేసీఆర్ అన్న మూడు అక్షరాలే నాడు తెలంగాణా అంతటా ప్రతిధనించాయి. ఆయనకు వ్యతిరేకంగా ఎంతటి పెద్ద వారు అయినా ఒక్క మాట కూడా అనలేని స్థితి ఉండేది. 2014లో సోలోగా అధికారంలోకి వచ్చి సీఎం అయిన కేసీఆర్ 2018లో మరింత ఎక్కువ మెజారిటీ సాధించి అద్వితీయంగా సీఎం అయిపోయారు. ఇక వరసగా మూడవసారి సీఎం అయి కేసీఆర్ సౌత్ ఇండియాలో హిస్టరీ క్రియేట్ చేస్తారు అనుకుంటే 2023 చివరిలో జరిగిన ఎన్నికల్లో ఆయన ఘోరరంగా ఓటమి పాలు అయ్యారు. దాంతో ఆయనకు ఆనాడే శని పట్టిందా అన్న చర్చ సాగింది. కేసీఆర్ జాతకం బాగా లేదు అని కూడా అంతా అనుకున్నారు. పోనీ ఓటమి తరువాత అయినా నెమ్మదిగా కోలుకుంటారనుకుంటే ఆయన ఇంట్లో జారిపడి అనారోగ్యం పాలు అయ్యారు. ఇక వరసబెట్టి దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. కేసీఆర్ ప్రభుత్వం మీద విచారణలతో మొదలైన కథ కాస్తా ఇపుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకు చుట్టుకున్నట్లు అవుతోంది. ఇది పెద్ద ఇష్యూగా మారబోతోంది. లిక్కర్ స్కాం లో కేసీఆర్ తనయ కవిత అరెస్ట్ కావడం ఆయనకు భారీ షాక్ గా చూడాలి. ఇదిలా ఉంటే ఆయన పార్టీ నుంచి ఇతర పార్టీలలోకి వలసలు వెళున్న నేతలలో బిగ్ షాట్స్ ఉన్నారు. రోజురోజుకు అలా చేరే వారి సంఖ్య పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. మరో వైపు ముంచుకొస్తున్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి సరైన అభ్యర్థులు దొరకడం లేదు.

# వయనాడ్‌లో త్రిముఖ పోటీ




తిరువనంతపురం, కేరళలోని వయనాడ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. ఇక్కడ రాహుల్ వరుసగా రెండోసారి పోటీ చేస్తుండగా, ఆయనపై కేరళ బిజెపి అధ్యక్షుడు కె. సురేంద్రన్ పోటీకి దిగారు. మరోవైపు సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా భార్య అన్నీరాజా కూడా పోటీలో ఉన్నారు. దీంతో ముక్కోణపు పోటీ అనివార్యమయ్యింది. దేశమంతా కమ్యూనిస్టులు ఇండియా కూటమిలో ఉన్నా..ఇక్కడ మాత్రం కాంగ్రెస్‌తో పోరాడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో అమేథీకి బీటలువారిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్మించుకుంటున్న కొత్త కోట వాయనాడ్. గత సార్వత్రిక ఎన్నికల్లో అమేథీలో ఆయన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే వయనాడ్‌లో మాత్రం 4.31 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన ఈ నియోజకవర్గం నుంచే ఈసారి మళ్లీ పోటీ చేస్తున్నారు. రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 26న పోలింగ్ జరగనున్న ఈ స్థానం కోసం బుధవారం 3వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. దశాబ్దాలుగా పార్టీకి కంచుకోటగా నిలిచిన అమేథీని వదులుకుని మరీ ఈ ఒక్క చోట నుంచే పోటీ చేస్తుండడంతో రాజకీయ ప్రత్యర్థులు సైతం ఈ సీటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వాయనాడ్‌ను కూడా మరో అమేథీలా మార్చి రాహుల్ గాంధీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నారు. పైగా దేశమంతటా మిత్రపక్షంగా ఉన్న కమ్యూనిస్టులు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బద్ద విరోధులుగా ఉన్నారు. ఇప్పుడు కొత్తగా భారతీయ జనతా పార్టీ సైతం గట్టి పోటీ ఇచ్చేందుకు పావులు కదుపుతోంది. దీంతో ఈసారి గెలుపు సునాయాసం కాదని, గెలవాలంటే కష్టపడాల్సిందేనని వాయనాడ్ సంకేతాలు పంపుతోంది. అమేథీలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయని ముందే గ్రహించారో.. లేక తన పోటీ కారణంగా కేరళలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలు మరింత పెంచవచ్చని భావించారో తెలియదు కానీ రాహుల్ గాంధీ 2019లో వాయనాడ్ నుంచి బరిలోకి దిగారు. కేరళలో ఎన్నో సీట్లు ఉండగా ఈ స్థానాన్నే ఎంచుకోడానికి కారణాల్లో కాంగ్రెస్ గెలుపొందుతూ రావడం ఒకటి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో వాయనాడ్ కొత్తగా ఏర్పడింది. అప్పటి నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. 2009లో ఎంఐ శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి సీపీఐ నేత ఎం. రహమతుల్లాపై భారీ మెజారిటీతో గెలుపొందారు. అప్పుడు ఇద్దరి మధ్య వ్యత్యాసం 1.53 లక్షలు.. 2014కు వచ్చేసరికి అది కేవలం 20 వేల మెజారిటీకి పడిపోయింది. అప్పుడు కూడా సమీప ప్రత్యర్థి సీపీఐ అయినప్పటికీ.. అభ్యర్థిగా సత్యన్ మోకేరి ఉన్నారు. 2019లో రాహుల్ గాంధీ పోటీ చేయడంతో కాంగ్రెస్ మళ్లీ ఒక్కసారిగా పుంజుకుంది. రాహుల్ గాంధీ 64.94శాతం ఓట్లు సాధించగా తన సమీప ప్రత్యర్థి సీపీఐ నేత పీపీ సునీర్ కేవలం 25.24శాతం ఓట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అంటే దాదాపు 40శాతం ఓట్ల వ్యత్యాసంతో రాహుల్ గాంధీ గెలుపొందారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రతి ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇస్తున్నది కమ్యూనిస్టులే. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ పేరుతో కమ్యూనిస్టుల సారథ్యంలోని కూటమి తరఫున సీపీఐ పోటీ పడుతూ వచ్చింది. ప్రతిసారీ అభ్యర్థిని మార్చుతూ వచ్చిన సీపీఐ ఈసారి ఏకంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా సతీమణి 'అన్నీరాజా'ను బరిలోకి దించింది. దేశమంతటా విపక్ష కూటమిలో భాగంగా పొత్తులున్నా.. కేరళలో మాత్రం కాంగ్రెస్, కమ్యూనిస్టులు తలపడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ రెండు పార్టీల మధ్య వైరం కూడా ఉంది. పైగా జాతీయ ప్రధాన కార్యదర్శి సతీమణి కాబట్టి సీపీఐ కార్యకర్తలు కూడా మరింత కష్టపడి పనిచేస్తున్నారు. కాంగ్రెస్ వరుసగా గెలుపొందుతూ రావడం, కాంగ్రెస్ అగ్రనేతగా ఉన్న రాహుల్ గాంధీయే సిట్టింగ్ ఎంపీగా ఉండడం ఆ పార్టీకి అనుకూలాంశాలు అయినప్పటికీ.. సీపీఐ ఎత్తుగడ కచ్చితంగా రాహుల్ గాంధీకి ప్రతికూలంగానే మారుతుంది. రాహుల్‌ను అన్నీరాజా ఓడించగలరా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేకపోయినా.. గట్టి పోటీని ఎదుర్కోక తప్పదన్న సంకేతాలు ఉన్నాయి.గత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 303 సీట్లు సాధించినప్పటికీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయిన రాష్ట్రాల్లో కేరళ ఒకటి. ఈసారి ఎలాగైనా ఖాతా తెరవాల్సిందేనన్న పట్టుదలతో ఆ పార్టీ నాయకత్వం, శ్రేణులు కేరళ అంతటా పనిచేస్తున్నాయి. ఆ క్రమంలో వాయనాడ్ స్థానాన్ని సైతం భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకం గా తీసుకుంది. గాంధీ కుటుంబాన్ని ఓడించడం అసాధ్యం అనుకున్న అమేథీలోనే రాహుల్ గాంధీని ఓడించిన ఘనతను సొంతం చేసుకున్న ఆ పార్టీ.. రాహుల్‌ను ఢీకొట్టేందుకు తమ కేరళ అధ్యక్షుడు కే. సురేంద్రన్‌ను ప్రయోగిస్తోంది. వాయనాడ్ నుంచి సురేంద్రన్‌ను బరిలోకి దించింది. ఈసారి బీజేపీ రాష్ట్రాధ్యక్షుడే బరిలో ఉన్నందున పార్టీ నేతలు కూడా మరింత ఉత్సాహంతో పనిచేస్తున్నారు. వీటన్నింటికీ తోడు కాషాయదళ అగ్రనాయకత్వం రాహుల్‌పై స్మృతి అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తున్నారు. అమేథీలో రాహుల్‌ను మట్టికరిపించిన ఘనత సొంతం చేసుకున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని వాయనాడ్‌లో ప్రచారాస్త్రంగా సంధిస్తున్నారు. ఈసారి కూడా తనకే గెలుపు అన్న నమ్మకాన్ని రాహుల్ గాంధీకే కల్పించగలిగారు. అందుకే ఆయన అమేథీ నుంచి తప్పుకుని కేవలం వాయనాడ్‌కు పరిమితమయ్యారు. అమేథీ అనుభవాలతో వాయనాడ్‌లో ప్రజలకు దగ్గరయ్యేందుకు అటు రాష్ట్ర శాఖతో పాటు జాతీయ నాయకత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగానే రాహుల్ గాంధీపై పదునైన విమర్శలతో స్మృతి ఇరానీని రంగంలోకి దింపింది. అలాగే బిజెపి శ్రేణులు ఇక్కడే ఎక్కువగా దృష్టి సారించారు. దీంతో వయనాడ్ ప్రత్యేకతను సంతరించుకుంది.

# మనం ఏ ఒక్కరినో ఎన్నుకోవడం లేదు




తిరువనంతపురం, దేశంలో లోక్‌సభ ఎన్నికల హడావిడి మొదలైంది. ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే కేరళ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోమారు అదృష్టం పరీక్షించుకోబోతున్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ప్రచారంలో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయనకు విలేకరుల నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. ఈ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయంగా భావిస్తున్న వ్యక్తి ఎవరో చెప్పాలంటూ జర్నలిస్టులు ఆయన్ను అడిగారు. దీనికి థరూర్ తనదైన శైలిలో బదులిచ్చారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఈ ప్రశ్న అసంబద్ధమైనది. అధ్యక్ష వ్యవస్థల్లో మాదిరిగా మనం ఒక వ్యక్తిని ఎన్నుకోవడం లేదు. మన దేశ బహుళత్వం, వైవిధ్యం, సమ్మిళిత వృద్ధిని సంరక్షించడం కోసం రూపొందించిన విధివిధానాలను పాటించే పార్టీ లేదా సంకీర్ణ కూటమిని ఎన్నుకుంటాం. ఇక్కడ ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం ఎవరంటే.. వ్యక్తిగత అహాన్ని పక్కనబెట్టి ప్రజల సమస్యలపై పోరాడే అనుభవజ్ఞులైన, సమర్థులైన నాయకుల బృందమే. అందులో నుంచి ఎవరిని ప్రధానిగా ఎన్నుకోవాలన్నది తర్వాతి విషయం. మన ప్రజాస్వామ్యాన్ని, భిన్నత్వాన్ని పరిరక్షించడమే ప్రథమ ప్రాధాన్యం అని శశిథరూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కేరళలోని తిరువనంతపురం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలుపొందిన శశిథరూర్.. తాజా ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలోకి దిగారు. ఆయనపై భాజపా నుంచి కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారు. వామపక్షాల నుంచి పన్నియన్ రవీంద్రన్ బరిలో ఉన్నారు. దీంతో ఈ త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారింది. రెండో దశలో భాగంగా ఏప్రిల్ 26న ఈ లోక్‌సభ నియోజకవర్గానికి పోలింగ్ జరగనుంది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రధాని నరేంద్ర మోదీ స్థానంలో ఎవరు ఉండాలనే ప్రశ్న అసంబద్ధమైనదని అన్నారు. అధ్యక్ష వ్యవస్థలో మాదిరిగా మనం ఎన్నుకోవడం లేదన్నారు. మేము ఏ ఒక్కరినీ ఎన్నుకోవడం లేదని, పార్టీని లేదా పార్టీల కూటమిని ఎన్నుకుంటామని ఆయన చెప్పారు.

# వేసవిలో మళ్లీ మొదలైన ప్రైవేట్ టీచర్ల వెట్టి



హైదరాబాద్,రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో విద్యారంగ పటిష్టతకు పాటుపడుతూ సామాజిక సేవ చేస్తున్న ప్రైవేట్ టీచర్లను కార్మికులుగా గుర్తించి వారికి పెన్షన్,పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, వారిని కార్మికులగా గుర్తించాలని ప్రైవేట్ పాఠశాలల టీచర్ల యూనియన్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ అన్నారు. ఇప్పటు ప్రైవేట్ టీచర్లు అనేక వృత్తిగతమైన ఇబ్బందులు ఎదుర్కొటున్నారని అన్నారు. ఈ క్రమంలో మళ్లీ విద్యావ్యాపారం మొదలయ్యిందన్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే పెద్ద బాధ్యతను మోస్తున్న ప్రైవేట్ టీచర్లు అంతకుమించిన సమస్యలనూ భరిస్తున్నారు. పనిగంటలు పెంచి, ఇతర పనులను కూడా విధుల్లో చేర్చి ప్రైవేట్ టీచర్లను తీవ్ర ఇబ్బంది లకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా వేసవిసెలవుల్లోనూ విధులు నిర్వహించాలని యాజమాన్యాలు హుకూం జారీ చేస్తున్న తీరు తమను వెట్టి కార్మికులుగా చేస్తోందని అన్నారు. టీచర్లనే సేల్స్ మ్యాన్‌లను చేస్తూ ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ టీచర్లకు నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సెలవుల్లోనూ వివక్ష చూపుతున్నాయి వేసవి సెలవులను సైతం యాజమాన్యాలు సరిగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి సెలవుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచే పనిని కూడా టీచర్లకే అప్పజెప్పడం దారుణం అన్నారు. వేసవిలో జీతాలుకూడా ఇవ్వడం లేదన్నారు. ధైర్యం చేసి ఏ టీచరైనా ప్రశ్నిస్తే ప్రైవేట్ అంటే ఇలానే ఉంటుందని, ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండని హుకూం జారీ చేస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల మందికి పైగా ఉన్నారని దాదాపు తెలంగాణలోని 90 శాతం మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వీరిపై ఉందన్నారు. ఉద్యోగం ఉండాలంటే ఇవన్నీ చేయాలని యాజమాన్యాలు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో ప్రైవేట్ టీచర్లు అన్ని పనులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్ల ఉద్యోగ భద్రత గాలిలో దీపం లాంటిదని, ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఊడిగం చేస్తున్న ఉద్యోగభద్రత లేదన్నారు. దీంతో అభద్రతా భావంతో ప్రైవేట్ టీచర్ కొట్టుమిట్టాడుతున్నాడు. అసలే అర కొర జీతాలు ఇస్తూ, మరోవైపు అన్ని పనులు నెత్తిన వేస్తూ ఎదురు చెప్పితే ఉద్యోగాలు ఉండవని యాజమాన్యాలు బ్లాక్‌మేల్ చేస్తున్నాయని పలువురు ప్రైవేట్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు చెబుతూ, ఇతర రాత పనులు చేస్తూ క్లర్క్‌గా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు క్యాన్వాసింగ్ కూడా చేస్తూ ప్రచారకర్తలుగా పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనుల ఒత్తిడిలో అసలు పని బోధన చేయలేక పోతున్నామని ప్రైవేట్ టీచర్లు వాపోతున్నారు. వేల రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ ఫీజుల పేరుతో యాజమాన్యాలు వసూళ్లు చేస్తూ ఖజానా నింపుకుంటున్నాయి. పాఠశాల ఆస్తులను పెంచుకుంటున్నాయి. కాని అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలను గతంలో అనేకసందర్భాల్లో అధికారులకు, మంత్రులకు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల సాధారణ సమయాలతో పాటు ప్రత్యేక తరగతుల పేరుతో గంటల కొద్దీ క్లాసులు ఏర్పాటు చేయడంతో మహిళా ఉపాధ్యాయులు శారీరక సమస్యలకు గురవుతున్నారు. పి.ఎఫ్, వైద్య, ఇతర సదుపాయాల నిమిత్తం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలపై ఆయన సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అమలు కావడం లేదని అన్నారు.

# పర్యావరణ విధ్వంసంతో ఉష్ణోగ్రతల్లో మార్పు




న్యూఢిల్లీ,పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం,ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా నడచుకోక పోవడం వంటి కారణాలతో దేశంలో ఏటేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హిమానీ నదాలు కరగి పోతున్నాయి. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు సాధారణం అయ్యాయి. దేశంలో గత 122 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా మార్చి నెలలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. పశ్చిమ అలజడులు లేకపోవడం వల్ల వర్షపాతంలో లోటు ఏర్పడిందని, అందుకే ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని వివరించింది. గతేడాది తక్కువ వర్షపాతం నమోదైందని, అది సాధారణం కన్నా 71 శాతం తక్కువని తెలిపింది. 1901 మార్చి నుంచి ఇంత తక్కువ నమోదు కావడం ఇది మూడోసారని చెప్పింది. రాష్ట్రంలో భానుడు భగ్గు మంటున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు 43.2 డిగ్రీలు దాటుతుండటంతో ఇండ్ల నుంచి బయటికొచ్చేందుకు జనం జంకుతున్నారు. వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటోంది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల లోపు బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యారోగ్యశాఖ సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరింది. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం సలహాలు, సూచనలు జారీ చేశారు. ఎండలో పనిచేయడం, ఆటలాడటం చెప్పులు లేకుండా బయట తిరగడం వంటివి చేయవద్దని చెప్పారు. పార్క్ చేసిన వాహనాల్లోకి పిల్లలు, పెంపుడు జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో వంటగదికి దూరంగా ఉండటం మంచిదని సూచించారు. మద్యం, చాయ్, కాఫీ, స్వీట్స్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. శరీర ఉష్ణోగ్రతలు 40.5 సెంటిగ్రేడ్ కంటే ఎకువగా నమోదవడం, విపరీతమైన చెమట, దాహం వేయడం, మగత, బలహీనత, తలతిప్పడం, కండరాలు పట్టేయం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని సూచించారు. జంటనగరాల్లోనూ ఎండలు మండుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో 41-42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో వడగాల్పుల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. జనసంచారం తగ్గి రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యధికంగా మూసాపేట- 41.9, ఖైరతాబాద్, చందానగర్- 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# నాకు సంబంధం లేదు: కెటిఆర్



హైదరాబాద్: ఫోన్ ట్యా పింగ్ వ్యవహారాలతో నాకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు ఆరోపణలు చే స్తే మంత్రి అయినా, ముఖ్యమంత్రి అయి నా న్యాయపరంగా ఎదుర్కొంటామని బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మం త్రి కెటిఆర్ పేర్కొన్నారు. తాను హీరోయిన్లను బెదిరించినట్లు మంత్రి ఆరోపించారని, హీరోయిన్లను బెదిరించాల్సిన ఖర్మ తనకు పట్టలేదని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి లీక్ వీరుడు అని, ఫోన్ ట్యాపింగ్‌పై నేరుగా మాట్లాడే ధైర్యం రేవంత్‌కు లేదని, అందుకే లీకు వీరుడు సీఎం లీకులు ఇస్తున్నారని ఆక్షేపించారు. కి రణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని అప్పటి తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. 2004 నుంచి ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ట్యాపింగ్ జరిగి ఉంటే అప్పుడు కీలక బాధ్యతల్లో ఉన్న అధికారులు మహేందర్ రెడ్డి, శివధర్ రెడ్డి, సజ్జనార్, రవి గుప్తా లాంటి అధికారులకు తెలియదా..? అని కెటిఆర్ ప్రశ్నించారు.తన ఫోన్ నిఘాలో ఉందని ఆపిల్ సంస్థ గతంలో మెసేజ్ కూడా పంపిందని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బిఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మాగంటి గోపీనాథ్, కెపి వివేకానంద, అరికెపూడి గాంధీ, కార్తీక్‌రెడ్డిలతో కలిసి మీడియా కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీళ్లు ఉండి కూడా పంటలు ఎండిపోవాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని కెటిఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి నిర్వహణ చేసే తెలివి లేదని, సాగునీరు ఇవ్వకుండా పంటలు ఎండిపోయేలా చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో పదేళ్లుగా తాగునీటి కష్టాలు లేవని, కానీ ఇవాళ నగరంలో ట్యాంకర్ల దందా జోరుగా నడుస్తోందని విమర్శించారు.సాగర్, సింగూరు, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లోనూ నీళ్లు ఉన్నాయని చెప్పారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తాలని, ప్రజల గొంతు ఎండకుండా చర్యలు తీసుకోండని పేర్కొన్నారు. అవసరమైతే జలమండలి వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో మళ్లీ ఇన్వర్టర్లు, జనరేటర్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఓటు వేయలేదని హైదరాబాద్ ప్రజలపై కక్ష కట్టారా చెప్పాలని డిమాండ్ చేశారు. పంటలు పండితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం నుంచి జల పరవళ్లు వస్తున్నాయని, సాగర్ నుంచి 14 టిఎంసిల నీరు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. మార్చి నెలలో హైదరాబాద్‌లో రెండు లక్షల ట్యాంకర్లు బుక్ చేసుకునే పరిస్థితి వచ్చిందని కెటిఆర్ చెప్పారు. బిఆర్ఎస్‌పై కక్షతో నీటిని సముద్రంలోకి వదిలారని, దేశంలో కాంగ్రెస్, రాహుల్ గాంధీని మించిన చెల్లని నోటు ఇంకా ఎక్కడైనా ఉందా..? అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. 218 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఒక్కో రైతు కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దానం అనర్హతపై ఆదివారంలోగా నిర్ణయం తీసుకోవాలి

గులాబీ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరిల సభ్యత్వాలు రద్దయి ఉప ఎన్నికలు రావడం ఖాయమని కెటిఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ నుంచి ఎంఎల్ఎగా ఎన్నికై హస్తం పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించిన దానం నాగేందర్ వ్యవహారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం వరకు నిర్ణయం తీసుకోవాలని, లేదంటే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. అనర్హతా పిటిషన్లను మూడు నెలల్లో తేల్చాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కెటిఆర్ గుర్తు చేశారు. ఒక పార్టీలో ఎన్నికై మరో పార్టీలో చేరిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు ఇతర పార్టీల వారిని చేర్చుకుంటున్న ఎవరిని రాళ్లతో కొట్టాలన్న మందకృష్ణ మాదిగ ప్రశ్నకు సమాధానం చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో పంచేందుకు చీరల నిల్వలు

విజయవాడ, కృష్ణాజిల్లా పామర్రు మండలం పెరిశేపల్లిలోని చెరుకూరి వెంకన్న చౌదరి ఇంట్లో చీరల డంప్‌ను పోలీసులు వెలికితీశారు. ఎన్నికల్లో పంచేందు సిద్ధంగా ఉంచిన చీరలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ..ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన పార్టీకి చెందిన చీరలు పట్టుకున్నాం. పోలీసులు వచ్చిన చాలా సమయం తర్వాత యజమాని వచ్చి ఇంటి తాళాల తీశాడు. దీనిపై స్థానికులు సమాచారం ఇవ్వడంతో తనీఖీలు చేశాం. రాత్రి 11.30 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నాం. సుమారు రూ.10లక్షల విలువ చేసే చీరలుగా ఉన్నట్లు గుర్తించాం.

# కస్టడీకి రాధాకిషన్‌రావు...



హైదరాబాద్, రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మా రిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. విచారణను వేగవంతం చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఇప్పటివరకు కేవలం పోలీసు అధికారులపై ఫోకస్ చే సిన ప్రత్యేక వి చారణ బృందం (సిట్) త్వరలోనే రాజకీయ నాయకుల వెంట పడబోతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ డిఎస్పీ ప్రణీత్ రావు, అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తి రుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులను హైదరాబా ద్ పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తమ వాంగ్మూలంలో బిఆర్ఎస్ ముఖ్య నేతలు చెబితేనే ప్రత్యర్థుల ఫోన్లు టాప్ చేశామని చెబుతున్నారు. ఇదే సమయంలో పలువురు రాజకీయ నేతలు తమ ఫోన్లను టాప్ చేశారంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో ఈ కేసులో అసలు సూత్రధారులను కనిపెట్టే దిశగా పోలీసుల చర్యలు ముమ్మరమయ్యాయి.ఇదిలా ఉండగా,ఈ కేసులో ఎ4గా చేర్చినటు వంటి టా స్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు కస్టడీ కోరుతూ, పోలీసులు వేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారించింది. రాధాకిషన్‌రావుకు ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గురువారం నుంచి ఏడు రోజుల పాటు రా ధాకిషన్‌రావును పోలీసులు ప్రశ్నించనున్నారు. రాధాకిషన్ రావు బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రాధకిషన్‌పై సుదర్శన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. గతంలో తనను బెదిరించి తన కూతురు పేరు మీదున్న అపార్ట్మెంట్ లోని ఓ ఫ్లాట్‌ను రాధాకిషన్ రావు బలవంతంగా రాయించుకున్నడని సుదర్శన్ తన ఫిర్యాదులో తెలిపారు. సుదర్శన్ ఫిర్యాదుపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావును నిందితులుగా చేర్చిన విషయం విధితమే. ఇదివరకే రాధాకిషన్ రావును విచారించిన పోలీసులు, పలు కీలక విషయాలు రాబట్టారు. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాప్ చేసినట్లు, రాధాకిషన్ రావు పోలీసుల విచారణలో పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com